కేసీఆర్ బస్సు యాత్రకు.. బ్రహ్మరథం



బస్సు యాత్రలో మాట్లాడుతున్న మాజీ సీఎం కేసీఆర్; చిత్రంలో ఎంపీ అభ్యర్థి డాక్టర్ ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి, నాగం జనార్దన్‌రెడ్డి

- బీఆర్‌ఎస్ నాగర్‌కర్నూల్ రోడ్‌షో విజయవంతం
- పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలకు జాతీయ హోదా కల్పించకపోవడం బీజేపీ దురుద్దేశమే: మాజీ సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు



సభకు హాజరైన ప్రజలు

నాగర్‌కర్నూల్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో గులాబీ బాస్, మాజీ సీఎం కే.చంద్రశేఖర్‌రావు నిర్వహిస్తున్న బస్సు యాత్రకు నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో జనం బ్రహ్మరథం పట్టారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బస్సు యాత్ర రాత్రి 7:10 గంటలకు ఉయ్యాలవాడకు చేరుకుంది. అక్కడి నుంచి బీఆర్‌ఎస్ శ్రేణులు బాణసంచా కాలుస్తూ అడుగడుగునా కేసీఆర్‌కు నీరాజనం పలికారు. కిలో మీటరున్నర దూరం యాత్ర పట్టణానికి చేరుకోడానికి గంటన్నర వ్యవధి పట్టింది. అనంతరం బస్టాండ్ సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన సభలో కేసీఆర్ ఉత్సాహంగా కనిపించారు. ఆయన ప్రసంగానికి జనం నుంచి కూడా అదే స్థాయిలో ప్రతిస్పందన లభించింది. బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ నీతి, నిజాయితీ గల అధికారిగా అభివర్ణించిన ఆయన.. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నుంచి ఆయనను గెలిపిస్తే ఎంతో ప్రయోజనం చేకూరుతుందన్నారు. నియోజకవర్గ ప్రజలపై తనకు పూర్తి విశ్వాసం ఉందని, బీఆర్‌ఎస్ అభ్యర్థికే పట్టం కడుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. మైనార్టీలను కూడా తన ప్రసంగం ద్వారా ఆకర్షించే ప్రయత్నం చేశారు. బీజేపీ కాంగ్రెస్‌లకు ఓటేస్తే ఎలాంటి ప్రయోజనం ఉండదని, సెక్యులర్ పార్టీ అయిన బీఆర్‌ఎస్‌కు మద్దతిస్తే వెన్నంటే ఉంటామన్నారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చాకే ఇమామ్, మౌజమ్‌లకు గౌరవ వేతనం ఇస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జాతీయ హోదా కల్పించలేదన్నారు. దీని పర్యవసానంగానే రాష్ట్ర ప్రభుత్వంపై ప్రాజెక్టు నిర్మాణానికి ఆర్థిక భారం పడిందన్నారు.

తెలంగాణ జాతిపిత కేసీఆర్: ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

తెలంగాణ రాష్ట్ర సాధనోద్యమంలో కీలక భూమిక పోషించిన కేసీఆర్ ఈ ప్రాంత జాతిపిత అని ఎంపీ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ వ్యాఖ్యానించారు. ఆయనకు పాదాభివందనం అంటూ తన ప్రసంగాన్ని ప్రారంభించారు. తనను ఎంపీగా గెలిపిస్తే ప్రపంచంలోనే నాగర్‌కర్నూల్ పార్లమెంట్‌కు వన్నె తెచ్చేలా వ్యవహరిస్తానని పేర్కొన్నారు.



బస్సు యాత్ర సందర్భంగా కళాకారుల నృత్యాలు



కేరళ కళాకారుల వాయిద్య ప్రదర్శన



బస్సులో ర్యాలీగా వస్తున్న మాజీ సీఎం కేసీఆర్



వనపర్తి జిల్లా కేంద్రంలో మధ్యాహ్నం వేళ నిర్మానుష్యంగా ఉన్న రోడ్డు

దంచి కొడుతున్న ఎండ

- వనపర్తి జిల్లా కానాయపల్లిలో 45 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు



మహబూబ్‌నగర్/నారాయణపేట/నాగర్‌కర్నూల్ టౌన్/గద్వాల టౌన్/వనపర్తి అర్బన్, ఏప్రిల్ 27: పాలమూరులో ఎండలు దంచి కొడుతున్నాయి. రోజురోజు ఎండల తీవ్రత పెరుగుతుండటంతో జనం అల్లాడుతున్నారు. రెండ్రోజులుగా జిల్లాలో 44 డిగ్రీల ఉష్ణోగ్రతలు దాటుతుండటంతో జనం బెంబేలెత్తిపోతున్నారు. ఎండలకు వడగాలులు తోడవడం, ఉక్కపోత, ఉబ్బరంతో అతలాకుతలం అవుతోంది. బయటకు వెళ్లాలంటేనే ఎండలకు భయపడాల్సి వస్తోంది. ఇక ఫుట్‌పాత్ వ్యాపారుల బాధ వర్ణనాతీతం. ఎండల్లోనే ఉపాధి చేసుకోవాల్సి వస్తోంది. పాలమూరు పట్టణంలోని ప్రధాన రహదారిపై వందల సంఖ్యలో చిరు వ్యాపారులు వ్యాపారం చేస్తారు. పండ్లు అమ్ముకునే వారు, పూలు అమ్మేవారు, శీతలపానీయాలు వంటి వ్యాపారులు ఎండలోనూ మాడుతున్నారు.



నారాయణపేటలో స్కూటీపై వెళ్తూ స్కార్ఫ్ కట్టుకున్న యువతులు

- వనపర్తి జిల్లా కొత్తకోట మండల పరిధిలోని కానాయపల్లిలో శనివారం అత్యధికంగా 45.0 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. శ్రీరంగాపూర్ 43.6, పెబ్బేరు, గోపాల్‌పేటలలో 43.3, చిన్నంబావి 43.1, పాన్‌గల్ 43.0, పెద్దమందడి 42.7, అమరచింత, వనపర్తి 42.4, ఆత్మకూరు 42.3, ఘణపూర్, వీపనగండ్ల 42.0, మదనాపూర్ 41.8, రేవల్లి 41.0 డిగ్రీల ఉష్ణోగ్రత జిల్లావ్యాప్తంగా అత్యల్పంగా పాన్‌గల్‌లో 24.7 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది.
- మహబూబ్‌నగర్ జిల్లాలోని సీసీకుంట మండలంలో 44.2 డిగ్రీలు నమోదుకాగా, మూసాపేటలో 43.4, బాలానగర్‌లో 43.2, మిడ్జిల్‌లో 43, గండీడ్‌లో 42.9, కోయిల్‌కొండలో 42.8, అడ్డాకుల, మహబూబ్‌నగర్‌లలో 42.5, భూత్పూర్‌లో 42.4, హన్వాడ, మహ్మదాబాద్, కోయిల్‌కొండలో 42.2 డిగ్రీలు నమోదైంది.
- జోగుళాంబ గద్వాల జిల్లా ధరూరు 44.2 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. గట్టులో 43.4 డిగ్రీలు, గద్వాలలో 43.3 డిగ్రీలు, రాజోలి, కేటిదొడ్డి మండలాల్లో 41.1 డిగ్రీలు, ఇటిక్యాల, వడ్డేపల్లి మండలాల్లో 42.8 డిగ్రీలు, మల్దకల్‌లో 42.4 డిగ్రీలు, అలంపూర్ 42.3 డిగ్రీలు, ఉండవల్లిలో 42.1 డిగ్రీలు, మల్దకల్‌లో 41.9 డిగ్రీలు, మానవపాడులో 41.3 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.
- నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలంలో 43.7, బిజినేపల్లిలో 43.7, అచ్చంపేటలో 43.3, నాగర్‌కర్నూల్‌లో 42.9, కల్వకుర్తిలో 42.9, చారకొండలో 42.8, వెల్దండలో 42.5, కోడేరులో 42.5, పెంట్లవెల్లిలో 42.4 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.
- నారాయణపేట జిల్లా కోస్గి మండలంలో 41 డిగ్రీలు, మక్తల్‌లో 42 డిగ్రీలు, నర్వలో 42 డిగ్రీలు, కృష్ణలో 41 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

సీ విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదులు చేయండి

- ఎన్నికల వ్యయ పరిశీలకుడు సౌరబ్

నాగర్‌కర్నూల్ టౌన్, ఏప్రిల్ 27: నాగర్‌కర్నూల్ పార్ల మెంటు నియోజకవర్గంలో ఎన్నికలకు సంబంధించి ప్రవ ర్తన నియమావళిని ఉల్లంఘించినట్లైతే ప్రజలు ఎన్నికల కమిషన్ రూపొం దించి సీ విజిల్ యాప్ ద్వారా ఫర్యాదులు చేయాలని నాగర్‌కర్నూ ల్ పార్లమెంటు ఎన్నికల వ్యయ పరిశీలకులు సౌరబ్ శనివారం ఒక ప్రక టనలో తెలిపారు. ఎన్నికల నిర్వహణపై ఏదైనా అభ్యం తరాలు, ఫిర్యాదులు ఉంటే కమాండ్ కంట్రోల్ రూం గ్రీవెన్స్ పోర్టల్‌ను సంప్రదించాలని సూచించారు. నాగర్ కర్నూల్, వనపర్తి, గద్వాల కలెక్టరేట్ కార్యాలయాల్లో సీ విజిల్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఎ న్నికల స మయంలో డబ్బు, బహుమతులు, మద్యం పంపిణీ, అ నుమతి లేకుండా ప్రైవేటు ఆస్తులపై పోస్టర్లు, ప్రచారం, ఓటర్లను బెదిరింపులు, రాత్రి 10 గంటల తర్వాత లౌడ్ స్పీకర్లతో ప్రచారం వంటి ఫిర్యాదులను సీ విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని పేర్కొన్నారు. ఓటర్లను ప్ర లోభ పెట్టేందుకు మద్యం, డబ్బు, గిఫ్టుల పంపిణీని ఫొ టోలు, వీడియోలు తీసి సీ విజిల్ యాప్ ద్వారా ఫిర్యా దు చేయాలన్నారు. నాగర్‌కర్నూల్ పార్లమెంటు పరిధి లోని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవా లని ఆయన కోరారు.

ప్రతి మద్యం దుకాణాన్ని తనిఖీ చేయాలి

తిమ్మాజిపేట: పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ప్రతి మద్యం దుకాణాన్ని ఎక్సైజ్ అధికారులు ఆకస్మిక తనిఖీ లు చేయాలని ఎలక్షన్ అబ్జర్వర్ సౌరబ్ సూచించా రు. మండల కేంద్రంలోని ఉమ్మడి పాలమూరు జిల్లాకు మద్యం సరఫరా చేసే మద్యం డిపోను శనివారం ఆయ న సందర్శించి డిపో ఇన్‌చార్జి మేనేజర్ వాసైఫ్ ఎక్సైజ్ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయ న డిపో మేనేజర్ ద్వారా పలు విషయాలు అడిగి తెలు సుకున్నారు. డిపోకు సంబంధించి ఎన్ని మద్యం షాపు లు బార్లు ఉన్నాయని అట్టి దుకాణాలకు ఎంత మేరకు మద్యం సరఫరా చేయడం జరిగిందని పూర్తి వివరాలు అడిగారు. అదేవిధంగా డిపోకు ఎన్ని సర్కిళ్లు ఉన్నాయని ఎక్సైజ్ సూపరింటెండెంట్ గాయత్రిని అడగగా కల్వకుర్తి, కొల్లాపూర్, అచ్చంపేట, మహబూబ్‌నగర్‌లో ఉన్నాయని ఆమె సమాధానం చెప్పారు. అనంతరం తిమ్మాజిపేటలో ని మద్యం దుకాణాన్ని తనిఖీ నిర్వహించారు. ఎక్సైజ్ ఎస్‌ఐ బాలీశ్వరి, సూపర్‌వైజర్లు లచ్చయ్య, మధు, శివకు మార్, విజయలక్ష్మీ ఉన్నారు.

ఇండియా కూటమిదే అధికారం

- అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ

అమ్రాబాద్, ఏప్రిల్ 27: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఇండియా కూటమి దేశంలో అధికారం చేపడుతుందని రాహుల్ గాంధీ ప్రధానమంత్రి పదవి చేపడ తారని నాగర్‌కర్నూల్ జిల్లా కమిటీ అధ్యక్షుడు, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండల పరిధిలోని జంగారెడ్డిపల్లి, కల్ము లోనిపల్లి, చింతలోనిపల్లి, తెలుగుపల్లి, బీకే తిరుమలాపూర్, బీకే ఉప్పునుంతల తదితర గ్రామాల్లో నాగర్‌కర్నూల్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ మల్లు రవిని భారీ మెజార్టీతో గెలిపించడం కోసం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు.



బీకే తిరుమలాపూర్‌లో ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ

ప్రతీ కాంగ్రెస్ కార్యకర్త డాక్టర్ మల్లు రవిని ఎంపీగా గెలిపించడం కోసం అహర్నిశలు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కాం గ్రెస్ పార్టీ కేంద్రంలో అధికారం చేపడితే సామాజిక న్యాయం కోసం తీవ్రంగా కృషి చేస్తుందని అన్నారు.

అనంతరం బీకే తిరుమలాపూర్‌లో వెలసిన ఎల్లమ్మతల్లి దేవాలయంలో డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, ఆపార్టీ శ్రేణులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కులమతాలకతీతంగా దర్గాను దర్శించుకోవడం గొప్ప విషయం

లింగాల: మండల పరిధిలోని మగ్దూంపూర్ దర్గాలో కులమతాలక తీతంగా ప్రతీ ఒక్కరు ప్రార్థనలు చేయడం గొప్ప విషయమని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. శనివారం దర్గా దగ్గర నిర్వహించిన మగ్దూం షావలి విజయోత్సవా లలో ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. మగ్దూంపూర్ దర్గా చాలా మహిమ గలదని, ఇక్కడ ప్రార్థనలు నిర్వహించిన వారు కోరుకున్న మొక్కులు నెరవేరుతాయనే నమ్మకం ప్రతీ ఒక్కరిలో ఉందని అందుకే దర్గా దినదినాభివృద్ధి చెందుతుందని అన్నారు. ముస్లిం పెద్దలు షఫీ, ముక్తార్, బారీ, నాయకులు నాగేశ్వర్ రావు, కొండల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కడుపులో ఉన్న శిశువు మృతి

- చివరి క్షణాల్లో సీరియస్‌గా ఉన్నదంటూ వేరే ఆస్పత్రికి రెఫర్ చేసిన ప్రైవేటు వైద్యులు
- శిశువు మృతికి వారి నిర్లక్ష్యమే కారణమంటూ బాధితుల ఆందోళన

గద్వాల క్రైం, ఏప్రిల్ 27: మహిళ కడుపులో ఉన్న శిశువు మృతి చెందగా.. అందుకు వైద్యులే కారణమంటూ బాధితులు ఓ ప్రైవేటు ఆస్పతి ముందు ఆందోళన చేసిన సంఘటన జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలో శనివారం చోటు చేసుకుంది. బాధితుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి.. జోగుళాంబ గద్వాల జిల్లా ధరూర్ మండలం ర్యాలంపాడు గ్రామానికి చెందిన గీత, నాగార్జున్‌రెడ్డిలకు రెండు సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. గర్భం దాల్చిన గీత జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో ప్రతీ నెల పరీక్షలు చేయించుకుంటోంది. ప్రతీ నెల బిడ్డ ఆరోగ్యంగా ఉందని, హార్ట్ బీట్ కూడా బాగుందని వైద్యులు సూచించారు. గీతకు తొమ్మిది నెలలు పూర్తికావడంతో మే 15న కాన్పు జరుగుతుందని వైద్యులు సూచించారు. గత గురువారం కడుపులో ఇబ్బందిగా ఉందని గీత ఆస్పత్రికి వచ్చింది. ఆమెను పరీక్షించిన వైద్యులు హార్ట్ బీట్ బాగుందని తెలిపి, ఒక ఇంజక్షన్ ఇచ్చారు. ఆ ఇంజక్షన్ వల్ల మరుసటి రోజు శుక్రవారం గీత కడుపులో నొప్పి వచ్చింది. దాంతో సాయంత్రం ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యుడు పరిస్థితి విషమించిందని, శిశువు కడుపులో మృతి చెందిందని, వెంటనే కర్నూల్‌కు తీసుకెళ్లాలని సూచించారు. ఇంత సడన్‌గా చెబితే ఎలా వెళ్లాలని, ఏదేమైనా మీరే చికిత్స చేయాలని కాళ్లు పట్టుకున్నా కనికరించ లేదు. తల్లి ప్రాణానికి ఇబ్బంది లేకుండా చూడాలని ఎంత ప్రాధేయపడ్డా పట్టించుకోకపోవడంతో గత్యంతరం లేక జిల్లా కేంద్రంలోని మరో ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లారు. అక్కడ ఆపరేషన్ చేసి, కడుపులో మృతి చెందిన శిశువును బయటికి తీశారు. కడుపులో మృతి చెందిన శిశువు ఎక్కువ సమయం ఉండటంతో తల్లి పరిస్థితి కూడా సీరియస్‌గా ఉందని ఆపరేషన్ చేసిన ఆస్పత్రి సిబ్బంది తెలిపారు. ప్రతీ నెల చెకప్‌లు చేయించినప్పుడు అంతా బాగానే ఉందని వైద్యులు చెప్పారని, ఇప్పుడు కడుపులో శిశువు ఎలా మృతి చెందిందని బాధితులు ప్రశ్నించారు. శిశువు మృతికి, తల్లి పరిస్థితి విషమించడానికి వైద్యుల నిర్లక్ష్యమే కారణమని ఆస్పత్రి ముందు ఆందోళనకు దిగారు. పోలీసులు రంగ ప్రవేశం చేసి సమస్యను సద్దుమనిగేలా చేశారు.

4 తులాల బంగారం అపహరణ

నాగర్‌కర్నూల్ క్రైం, ఏప్రిల్ 27 : తాళం వేసిన ఇంటికి కన్నం వేసి నాలుగు తులాల బంగారం అపహరించుకుపోయిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో శనివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ గోవర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం.. హౌసింగ్‌బోర్డు బీసీ కాలనీలో నివాసం ఉంటున్న రజియాబేగం కుటుంబ సభ్యులతో కలిసి మహబూబ్‌నగర్ బంధువుల ఇంటికెళ్లింది. శనివారం ఇంటికి వచ్చే సరికి తలుపులు తెరిచి కనిపించింది. ఇంట్లోకి వెళ్లి చూడగా.. దొంగతనం జరిగినట్లు గుర్తించింది. బీరువా తాళం పగలగొట్టి.. నాలుగు తులాల బంగారు ఆభరణాలు అపహరించుకుని వెళ్లినట్లు గుర్తించి, పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.



కోయిలదిన్నె రోడ్డు సమీపంలోని ఓ ఇంట్లో పట్టుబడిన రేషన్ బియ్యం

114 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

- ఇంటి యజమానిపై కేసు నమోదు : జోగుళాంబ గద్వాల ఎస్పీ రితిరాజ్

వడ్డేపల్లి, ఏప్రిల్ 27 : మునిసిపాలిటీ కేంద్రమైన శాంతినగర్ - కోయిలదిన్నె రోడ్డు సమీపంలో ఉన్న ఓ ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 114 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. సమీపంలోని వ్యక్తుల సమాచారం మేరకు శాంతినగర్ సీఐ రత్నం ఆధ్వర్యంలో ఎస్సై సంతోష్ ఘటనా స్థలానికి వెళ్లి ఇంటిపై దాడి చేసి అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. 221 సంచుల్లో నిల్వ ఉంచిన 114 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సీజ్ చేశారు. వీటిలో 62 క్వింటాళ్ల రేషన్ బియ్యం, 52 క్వింటాళ్ల నూకలను గుర్తించి వాటిని సీజ్ చేసి, కేసు నమోదు చేసినట్లు ఎస్పీ రితిరాజ్ తెలిపారు. 117 సంచుల్లో 62 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం, 104 సంచుల్లోని 52 క్వింటాళ్ల పీడీఎస్ నూకలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. రేషన్ బియ్యాన్ని నిల్వ ఉంచిన ఇంటి యజమాని తెలుగు భాస్కర్‌పై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నటువంటి వారిపై పోలీసులు నిఘా ఉంచారని తెలిపారు. అక్రమ రవాణా నియంత్రణకు ప్రత్యేక చర్యలతో పాటు వాటిని తరలించే వారిపై, నిల్వ ఉంచిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు డబ్బులు, మద్యం, ఇతర విలువైన వస్తువులు తీసుకెళ్లొద్దని ఎస్పీ సూచించారు.

ఆర్టీసీ బస్ డ్రైవర్‌ను దూషించిన

ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు

అచ్చంపేట టౌన్, ఏప్రిల్ 27 : ఆర్టీసీ బస్ డ్రైవర్‌ను దూషించిన ఆటో డ్రైవర్‌పై శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఎస్సై రాము తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట డిపోకు చెందిన డ్రైవర్ కోట్ల జనార్ధన్ శనివారం అచ్చంపేట నుంచి లింగాల రూట్‌లో వెళ్తుండగా లింగాల చౌరస్తాలో రద్దీగా ఉన్న ఆటోను సైడ్ ఇవ్వమని కోరారు. దీంతో చందంపేటకు చెందిన ఆటో డ్రైవర్ సభావత్ హన్మంతుతో పాటు, ఆటోలో ఉన్న మహిళ నీలాబాయి డ్యూటీలో ఉన్న బస్ డ్రైవర్‌ను దుర్భాషలాడారు. అదేవిధంగా, కండక్టర్ సునీతపై వాగ్వాదానికి దిగారు. అంతేకాకుండా డ్రైవర్‌పై దాడికి దిగి బస్సు అద్దాన్ని పగులగొట్టి ప్రభుత్వ ఆస్తిని ధ్వంసం చేశారు. ప్రభుత్వ ఉద్యోగుల విధులకు ఆటంకం కలిగించిన ఆటో డ్రైవర్ హన్మంతుపై బస్సు డ్రైవర్ జనార్ధన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

నాడు కళకళ.. నేడు వెలవెల

- ఆత్మకూరు వ్యవసాయ మార్కెట్ దుస్థితి
- జాతీయ హోదా కలిగినా ఖరీదుదారులు కరువు
- ఉపాధి కోల్పోయిన హమాలీలు, వ్యవసాయ కూలీలు



నిరుపయోగంగా ఉన్న ధర్మకాంట

ఆత్మకూరు, ఏప్రిల్ 27 : వనపర్తి జిల్లా ఆత్మకూరు పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ ఒకప్పుడు వ్యవసాయ కూలీలతో పాటు, రైతులు, హమాలీలు, ఖరీదుదారులతో కళకళలాడుతూ ఉండేది. నేడు ఖరీదుదారులు కరువై హమాలీలతో పాటు వ్యవసాయ కూలీలు, వ్యవసాయ మార్కెట్ ప్రాంతంలోని ఆయా వ్యాపారాలు చేసుకునే చిరు వ్యాపారులు ఉపాధి కోల్పోయి తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఒకప్పుడు ఆత్మకూరు, అమరచింత మండలాల పరిధిలోని రైతులు వేరుశనగ, కంది, ఆముదం, పత్తి వంటి పంటలను విక్రయించేందుకు మార్కెట్‌కు భారీ సంఖ్యలో తీసుకువచ్చేవారు. దీంతో మార్కెట్ రైతులతో కళకళలాడుతూ ఉండేది. ఆత్మకూరు, అమరచింత మండలాలకు చెందిన ఖరీదుదారులతోనే కాకుండా ఉమ్మడి జిల్లాల నుంచి ఖరీదుదారులు వచ్చి క్రయ విక్రయాలు జరుపుతుండేవారు. నిత్యం మార్కెట్‌కు ఆదాయంతో పాటు 300కు పైగా హమాలీలు, చాటకూలీలు ఉపాధి పొందుతూ జీవనం సాగించేవారు. అప్పటి పాలక ప్రభుత్వాలు వ్యవసాయ మార్కెట్ అభివృద్ధి నిమిత్తం మార్కెట్‌లో ఐదు వేల మెట్రిక్ టన్నులు, 2.50 మెట్రిక్ టన్నులు, రెండు మెట్రిక్ టన్నుల గోదాములను ఏర్పాటు చేయడంతో పాటు, జాతీయ హోదా కల్పించడంతో ఖరీదుదారులు భారీ సంఖ్యలో వ్యవసాయ మార్కెట్‌కు వచ్చి క్రయవిక్రయాలు జరిపేవారు.

ప్రస్తుతం రైతులు రావడమే కరువు

ఆత్మకూరు, అమరచింత మండలాల పరిసర ప్రాంతంలో ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు ఉండడంతో వరిని రైతులు అత్యధికంగా సాగు చేస్తున్నారు. మెట్ట ప్రాంతాలైన కొన్ని గ్రామాల్లో మాత్రమే వాణిజ్య పంటలైన వేరుశనగ, కంది, ఆముదం, పత్తి వంటి పంటలు సాగు చేస్తున్నారు. ఆత్మకూరు పట్టణ పరిసర ప్రాంతాల్లో రైస్‌మిల్లర్లు నేరుగా రైతుల కల్లాల వద్దకే వెళ్లి వరిని కొనుగోలు చేయడంతో పూర్తిస్థాయిలో మార్కెట్‌కు ఆదాయం తగ్గిపోవడమే కాకుండా మార్కెట్‌లో పనిచేసే హమాలీలు ఉపాధి కోల్పోయి తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. మరోవైపు ధాన్యం నిల్వ ఉంచుకునేందుకు గాను రాష్ట్ర ప్రభుత్వం కోట్ల రూపాయలు వెచ్చించి మార్కెట్‌లో గోదాములను ఏర్పాటు చేసింది. మార్కెట్‌కు ధాన్యం రాకపోవడంతో ఖాళీ గోదాములతో మార్కెట్‌కు కొంతమేర ఆదాయం తగ్గిందని అధికారులు పేర్కొంటున్నారు. రైస్‌మిల్లర్లు, కమిషన్ ఏజెంట్లు కొనుగోలు చేసిన ధాన్యాన్ని విక్రయించేందుకు ఇతర ప్రాంతాలకు తరలిస్తున్న నేపథ్యంలో చెక్ పోస్టుల వద్ద 2022-23 సంవత్సరానికి సంబంధించి రూ. కోటి 90 లక్షల 80 వేల ఆదాయం మాత్రమే వచ్చింది.



ఖాళీగా ఉన్న ఆత్మకూరు వ్యవసాయ మార్కెట్ గోదాములు

ధర్మకాంటాను వినియోగంలోకి తేవాలి

రైతులు తమ ధాన్యాన్ని గంప గుత్తగా అమ్మేందుకు అప్పటి పాలక ప్రభుత్వం మార్కెట్‌లో రూ.ఆరు లక్షలు వెచ్చించి ధర్మకాంటాను ఏర్పాటు చేసింది. అయితే కాంటా వద్ద సీసీ రోడ్డు నిర్మించకపోవడం, భారీ వాహనాలు వెళ్లేందుకు అనుకూలంగా లేకపోవడంతో మరుగున పడింది. ప్రస్తుతం రైతులు తమ పంటలను రైస్‌మిల్లర్లకు విక్రయిస్తుండగా వారి వద్దనున్న ధర్మకాంటాలపై అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ పరిధిలో ఉన్న ధర్మకాంటాలను వినియోగంలోకి తెస్తే రైతులకు అనుమానాలు తొలగిపోవడంతో పాటు మార్కెట్‌కు ఆదాయం కూడా లభిస్తుందని పలువురు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ధర్మకాంటాకు మరమ్మతులు చేపడతాం..



ఆత్మకూరు వ్యవసాయ మార్కెట్‌లో రూ.ఆరు లక్షలు వెచ్చించి అప్పట్లో ధర్మకాంటాను ఏర్పాటు చేశారు. కానీ లోడింగ్ అయిన హెవీ వెహికల్స్ వెళ్లేందుకు రోడ్డు అనుకూలంగా లేకపోవడంతో నిరుపయోగంగా మిగిలిపోయింది. ప్రస్తుతం సీసీ రోడ్డు నిర్మాణానికి జిల్లా ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం. అదేవిధంగా మార్కెట్‌లో పదివేల మెట్రిక్ టన్నుల గోదాంలు ఖాళీగా ఉన్నాయి. వాటిని అద్దెకు తీసుకోవాలని ఇదివరకే ప్రకటనలు జారీ చేశాం.

- శ్రీనివాసులు,
ఆత్మకూరు వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి

రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ టోర్నీకి తరలిన జిల్లా జట్టు



ఉమ్మడి జిల్లా ఫుట్‌బాల్ జట్టు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, ఏప్రిల్ 27 : పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో శనివారం నుంచి ఈనెల 30వ తేదీ వరకు జరగనున్న రాష్ట్ర స్థాయి సీనియర్ ఇంటర్ ఫుట్‌బాల్ టోర్నీలో పాల్గొనే ఉమ్మడి జిల్లా పురుషుల జట్టు తరలివెళ్లింది. శనివారం జట్టును జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎన్‌పీ.వెంకటేశ్, భానుకిరణ్ అభినందించారు. కార్యక్రమంలో సీనియర్ క్రీడాకారుడు నగేష్ ఉన్నారు.

జట్టు వివరాలు : కాగా, జిల్లా జట్టులో వంశీగౌడ్, ప్రకాష్‌రాజ్, లక్ష్మణ్‌గౌడ్, స్యాముల్, దినేష్, రాములు, అరుణ్, కృష్ణ, స్నేహిత్, రామ్‌చరణ్, సాయికృష్ణ, సాయిరామ్, పవన్ కుమార్, హబీబ్‌హషమ్, ప్రేమ్‌కుమార్, షారుణ్‌కుమార్, ముస్తాఫ, ఆర్య, విశ్వనాథ్ ఉన్నారు.



ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ ఆంధ్రజ్యోతి డైరెక్టర్ వేమూరి కనకదుర్గ తృతీయ వర్ధంతి సందర్భంగా శనివారం మహబూబ్‌నగర్ యూనిట్ కార్యాలయంలో నివాళ్లు అర్పిస్తున్న సిబ్బంది

పాలమూరుకు ద్రోహం చేసిందే కేసీఆర్

- జగన్మోహన్‌రెడ్డితో కుమ్మక్కై పోతిరెడ్డిపాడు ద్వారా నీరందించారు
- పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను బొంద పెట్టాలి
- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 27 : పాలమూరుకు ద్రోహం చేసిందే కేసీఆర్ అని అలాంటి ఆయన ఇప్పుడు పాలమూరు మీద మొసలి కన్నీరు కారుస్తున్నారని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ఆరోపించారు. పాలమూరు రంగారెడ్డి పథకానికి తీసుకువచ్చిందే కాంగ్రెస్ పార్టీ అని, జూరాల నుంచి డిజైన్ చేసిన ప్రాజెక్ట్‌ను కాసుల కక్కుర్తి కోసం జూరాల నుంచి శ్రీశైలం బ్యాక్ వాటర్‌కు తీసుకెళ్లారని విమర్శించారు. పదేళ్లయినా 20 శాతం పనులు పాలమూరుకు చేయలేదు కానీ లక్షల కోట్లు పెట్టి కాళేశ్వరం నిర్మించి పూర్తి చేశారన్నారు. ఇక ఏపీ సీఎం జగన్మోహన్ రెడ్డితో చీకటి ఒప్పందం కుదుర్చుకుని పోతిరెడ్డిపాడు ద్వారా నీటి తరలింపునకు సహకరించారన్నారు. అక్కడ వచ్చే ఎంపీ సీట్లతో తమకు మద్దతు ఇవ్వాలని రాయించుకుని 93 వేల క్యూసెక్కుల నీటిని తీసుకెళ్లేలా సహకరించలేదా అని ప్రశ్నించారు. ఈ పాలమూరు ద్రోహి కళ్లు మూసుకుని కృష్ణానీటిని తాకట్టు పెట్టారన్నారు. ఆర్థిక వ్యవస్థను విధ్వంసం చేసి రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో కూరుకుపోయేలా చేశారన్నారు. పాలమూరుకు ఇన్ని ద్రోహాలు చేసిన కేసీఆర్‌కు పార్లమెంట్ ఎన్నికలో బొంద పెట్టాలని జిల్లా ప్రజలకు పిలుపునిచ్చారు. ఓడిపోతామని తెలిసే బీజేపీతో కుమ్మక్కై ఆ పార్టీని గెలిపించే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. బీజేపీ పదేళ్లలో ఏం ఒరగబెట్టలేదని, పాలమూరుకు అదనపు నిధులు ఇవ్వలేదని, జాతీయ హోదా ఇవ్వలేదని అలాంటి బీజేపీకి ఓటేస్తే మన వేలితో మనం పొడుచుకున్నట్లేనని తెలిపారు. రుణమాఫీ గురించి కేసీఆర్ మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని, లక్ష రూపాయల రుణమాఫీ చేస్తానని రెండేళ్ల తరువాత మూడు లక్షల మంది రైతులకు మాత్రమే మొదటి విడతగా రూ.25 వేలు మాఫీ చేశారన్నారు. ఆగస్టు 15లోగా రేవంత్‌రెడ్డి చెప్పినట్లుగా రైతులకు రూ.రెండు లక్షల రుణమాఫీ చేస్తారని ఇందులో అనుమానం లేదని రైతులకు సూచించారు. సమావేశంలో నాయకులు చంద్రకుమార్‌గౌడ్, ఎన్‌పీ వెంకటేశ్, సిరాజ్ ఖాద్రి, బెనహర్, లక్ష్మణ్‌యాదవ్, రాములు యాదవ్, నాగరాజు పాల్గొన్నారు.

ఫోన్ ట్యాపింగ్ చేశారంటూ ఎస్పీకి ఫిర్యాదు

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 27 : తన ఫోన్‌ను ట్యాపింగ్ చేశారంటూ టీజేఏసీ మాజీ చైర్మన్ జి.రాజేందర్‌రెడ్డి శనివారం జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆదేశాల మేరకు పోలీస్ అధికారులు తన ఫోన్‌ను ట్యాపింగ్ చేశారని పేర్కొన్నారు. తన ఫోన్‌ను ట్యాపింగ్ చేసి తన స్నేహితులను బ్లాక్‌మెయిల్ చేశారన్నారు. జిల్లాలో తాను సుదీర్ఘకాలంగా టీఎన్‌జీవో అధ్యక్షులుగా, టీజేఏసీ చైర్మన్‌గా పనిచేశానని గుర్తు చేశారు. 2016 నుంచి 2023 వరకు తన ఫోన్‌ను ట్యాప్ చేశారని, ఎలాంటి కారణాలు లేకుండానే తనపై, తన సన్నిహిత స్నేహితులను వేధించారన్నారు. దీనిపై విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈయనతో పాటు ఎస్పీని కలిసిన వారిలో టీపీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి, టీపీఆర్టీయూ మాజీ అధ్యక్షుడు గట్టు వెంకట్‌రెడ్డి ఉన్నారు. కాగా ఇదే విషయమై ఇదివరకే ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి డీజీపీకి ఫిర్యాదు చేయగా, కౌన్సిలర్ బురుజు సుధాకర్‌రెడ్డి తన ఫోన్ ట్యాపింగ్ చేశారని ఎస్పీకి ఫిర్యాదు చేశారు.

అనుమానాస్పదంగా మహిళ మృతి

దామరగిద్ద, ఏప్రిల్ 27 : అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి చెందిన సంఘటన శనివారం నారాయణపేట జిల్లా దామరగిద్ద మండల కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గడిమున్కన్‌పల్లి గ్రామానికి చెందిన సవిత(35)కు ఎనిమిది సంవత్సరాల క్రితం నర్సాపూర్ గ్రామానికి చెందిన భాస్కర్‌తో వివాహమైంది. వీరికి ఐదేళ్ల బాబు, పాప ఉన్నారు. మూడురోజుల క్రితం పిల్లలను ఇంట్లోనే ఉంచిన సవిత ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లిపోయింది. ఆమె ఇంటి నుంచి వెళ్లిన విషయాన్ని భర్త భార్య తల్లిదండ్రులకు తెలిపాడు. అనంతరం పోలీసులను ఆశ్రయించి రెండురోజుల పాటు వెతికారు. శనివారం మండల కేంద్రంలోని ఏనికల్ లక్ష్మప్ప ఇంట్లో సవిత శవమై కన్పించింది. లక్ష్మప్ప మూడురోజుల క్రితం ఇంటికి తాళం వేసి ఓ పెళ్లికి వెళ్లాడు. శనివారం ఇంటికి తిరిగి వచ్చి చూడగా తాళం విరగ్గొట్టి కన్పించింది. లోపలికి వెళ్లి చూడగా సవిత మృతదేహం కన్పించడంతో పోలీసులను విషయాన్ని తెలిపాడు. దీంతో నారాయణపేట సీఐ శంకర్, ఎస్సై వసంతలు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. పంచనామా అనంతరం నారాయణపేట జిల్లా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. గుర్తు తెలియని వ్యక్తులు లక్ష్మప్ప ఇంట్లో సవిత మృతదేహాన్ని పడవేసి ఉంటారని చుట్టుపక్కల వారు అనుమానం వ్యక్తం చేశారు. భాస్కర్ నారాయణపేట జూనియర్ కాలేజీలో కాంట్రాక్టు లెక్చరర్‌గా పని చేస్తున్నాడు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వసంత తెలిపారు.

పోలీసుల తనిఖీల్లో నగదు పట్టివేత

గద్వాల క్రైం, ఏప్రిల్ 27 : లోక్‌సభ ఎన్నికల కోడ్‌లో భాగంగా జిల్లా వ్యాప్తంగా పోలీసులు చేపట్టిన తనిఖీల్లో శనివారం రూ.4,83,900 నగదును సీజ్ చేసి జిల్లా ఎన్నికల గ్రీవెన్స్ రిడ్రెసల్ కమిటీకి అప్పగించినట్లు జోగుళాంబ గద్వాల జిల్లా ఎస్పీ రితిరాజ్ తెలిపారు. మానవపాడు మండల కేంద్రంలో నిర్వహించిన పోలీసుల తనిఖీల్లో రూ.లక్ష, అయిజ పట్టణం మేడికొండ ఎక్స్‌రోడ్‌లో రూ.69,500, ధరూర్ మండలం నర్సన్‌దొడ్డి చౌరస్తాలో రూ.60 వేలు, రాజోలిలో రూ.లక్షా రెండు వేలు, గద్వాల రూరల్ పరిధిలోని జమ్మిచేడు వద్ద రూ.52,400, ఉండవల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని పుల్లూరు చెక్‌పోస్టు వద్ద రూ.లక్షతో కలిపి మొత్తం రూ.4,83,900 పట్టుకున్నట్లు ఎస్పీ వివరించారు.

సోలీపూర్ గ్రామంలో..

ఖిల్లాఘణపురం/గోపాల్‌పేట: వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురం మండలం సోలీపూర్‌లో శనివారం చేపట్టిన వాహనాల తనిఖీలో రూ.1.95 లక్షల నగదు ను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై శ్రీహరి తెలిపారు. గట్లుఖానాపూర్ గ్రామానికి చెందిన రామ్‌సింగ్ బైక్‌పై సోలీపూర్ నుంచి గ్రామానికి నగదును తీసుకెళ్తుండగా పోలీసులు పట్టుకున్నారు. నగదును కలెక్టరేట్‌లో డిపాజిట్ చేస్తామని ఎస్సై తెలిపారు. గోపాల్‌పేట మండలంలోని బుద్దారం చెక్ పోస్టు వద్ద బైక్‌పై వెళ్తున్న శ్రీను అనే వ్యక్తి వద్ద రూ.57,500 నగదు పట్టుకున్నట్లు ఎస్‌ఐ హరిప్రసాద్ తెలిపారు.

చేగుంట చెక్‌పోస్టు వద్ద..

కృష్ణ : నారాయణపేట జిల్లా కృష్ణ మండలం చేగుంట చెక్‌పోస్టు వద్ద చేపట్టిన వాహనాల తనిఖీలో రూ.లక్షా 20 వేల నగదును పట్టుకున్నట్లు ఎస్సై ఎండీ.నవీద్ తెలిపారు. కర్ణాటక నుంచి వస్తున్న వాహనాన్ని తనిఖీ చేయగా యాదగిరి జిల్లాకు చెందిన శివప్ప నుంచి నగదును స్వాధీనం చేసుకొని గ్రీవెన్స్ కమిటీకి పంపించినట్లు ఎస్సై వివరించారు.

రంగారెడ్డిగూడ గ్రామ శివారులో...

రాజాపూర్ : మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్ మండలం రంగారెడ్డిగూడ గ్రామ శివారులోని జాతీయ రహదారి-44పై ఏర్పాటుచేసిన చెక్‌పోస్టు వద్ద శనివారం వాహనాల తనిఖీలో రూ.3.37 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై రవి తెలిపారు. హైదరాబాద్ నుంచి అనంతపూర్‌కు వెళ్తున్న రోసప్ప, అఖీల్, నూస్‌జాక్సర్ నుంచి నగదును స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నగదును జిల్లా ఎన్నికల అధికారులకు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు.

ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య

ఎర్రవల్లి, ఏప్రిల్ 27 : కుటుంబ కలహాలతో ఉరి వేసుకొని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఇటిక్యాల ఎస్సై వెంకటేష్ తెలిపిన వివరాల ప్రకారం.. జోగుళాంబ గద్వాల జిల్లా ఎర్రవల్లి మండలం ఉదండాపురం గ్రామానికి చెందిన డాకేశ్వర్‌రెడ్డి(35) శుక్రవారం అర్ధరాత్రి తన ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సోదరుడు తిరుపతిరెడ్డి శనివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఎర్రవల్లి, ఏప్రిల్ 27 : పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై వెంకటేష్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. జోగుళాంబ గద్వాల జిల్లా ఎర్రవల్లి మండలం జింకలపల్లి గ్రామానికి చెందిన తెలుగు వెంకటేష్(54) కడుపు నొప్పి భరించలేక శుక్రవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కర్నూలు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుమారుడు ప్రవీణ్ శనివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో గుర్తు తెలియని వృద్ధురాలు..

కోస్గి రూరల్, ఏప్రిల్ 27 : నారాయణపేట జిల్లా కోస్గి ఆర్టీసీ బస్టాండ్‌లో గుర్తు తెలియని వృద్ధురాలు మృతి చెందింది. భిక్షాటన చేస్తూ జీవనం సాగించే వృద్ధురాలు(55) వడదెబ్బకు గురై మృతి చెందినట్లు పోలీసులు గుర్తించారు. మృతదేహాన్ని శనివారం కోస్గి ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీకి తరలించారు. వృద్ధురాలి వివరాలు ఇంకా తెలియరాలేదు.

రైలు ఢీకొని వృద్ధుడు..

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 27 : రైలు పట్టాలు దాటుతున్న వృద్ధుడిని రైలు ఢీకొట్టడంతో తీవ్ర గాయాలపాలైన అతను మృతి చెందాడు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రం సమీపంలోని తిమ్మసానిపల్లికి చెందిన ఎల్లయ్య(85) శనివారం ఉదయం 7:30 గంటలకు కాటన్‌మిల్లు వేంకటేశ్వరస్వామి ఆలయానికి వెళ్లి వస్తానని ఇంట్లో చెప్పి బయలుదేరాడు. మార్గమధ్యలో పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొట్టింది. తీవ్ర గాయాలతో ఉన్న వృద్ధుడిని స్థానికులు ఆసుపత్రికి తరలించగా అప్పటికే చనిపోయినట్లు వైద్యులు తెలిపారు. అయితే మృతుడికి చెవులు సరిగ్గా వినపడవని, రైలు రాకను గమనించకుండా పట్టాలు దాటడం వల్లనే ప్రమాదం జరిగినట్లు రైల్వే పోలీసులు వివరించారు.

దైవ దర్శనానికి వెళ్తూ తిరిగిరాని లోకాలకు..

కొత్తకోట, ఏప్రిల్ 27 : మిత్రునితో కలిసి దైవ దర్శనానికి వెళ్తూ తిరిగిరాని లోకాలకు వెళ్లిన సంఘటన వనపర్తి జిల్లా కొత్తకోట మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై మంజునాథ్ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ లాల్‌దర్వాజాకు చెందిన సాయినాథ్(23), లక్ష్మీకాంత్‌లు కర్ణాటక రాష్ట్రంలోని మురుడేశ్వర దేవాలయానికి శనివారం తెల్లవారుజామున ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. కొత్తకోట మండలంలోని ముమ్మళ్లపల్లి గ్రామ జాతీయ రహదారిపై ముందు వెళ్తున్న గుర్తు తెలియని వాహనాన్ని వెనక నుంచి వీరి ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. బైక్ నడుపుతున్న సాయినాథ్ తలకు బలమైన గాయం కావడంతో చికిత్స నిమిత్తం 108లో లక్ష్మీకాంత్ జిల్లా ఆసుపత్రికి తీసుకెళ్లాడు. పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు చెప్పడంతో మెరుగైన చికిత్స కోసం మహబూబ్‌నగర్ జిల్లా ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. కేసు నమోదు చేసి శవాన్ని పోస్టుమార్టానికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

వివాహిత అదృశ్యం

భూత్పూర్, ఏప్రిల్ 27 : పుట్టింటికి వెళ్లి వస్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లిన వివాహిత అదృశ్యమైంది. ఎస్సై శ్రీనివాసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలం తాటికొండ గ్రామానికి చెందిన చిట్కురి నర్సిములు, చిట్కురి అంజమ్మలు భార్యాభర్తలు. అంజమ్మది తల్లిగారి ఊరైన పాలమూరుకు వెళ్లొస్తానని ఈనెల 18వ తేదీన గ్రామం నుంచి బయలుదేరి వెళ్లింది. శనివారం వరకు తిరిగి రాకపోవడంతో భర్త పాలమూరులోని అత్తగారింటి వద్ద, ఇతర బంధువుల వద్ద వాకబు చేశాడు. ఆచూకీ తెలియరాకపోవడంతో శనివారం భూత్పూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బాలికను వేధించిన కేసులో యువకుడికి రిమాండ్

పాన్‌గల్, ఏప్రిల్ 27 : వనపర్తి జిల్లా పాన్‌గల్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికను వేధించిన కేసులో యువకున్ని పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఎస్సై వేణు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికను అదే గ్రామానికి చెందిన యువకుడు ప్రేమించి వెంట తీసుకెళ్లాడు. శనివారం బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోక్సో కేసు నమోదు చేసి యువకున్ని అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

కర్ణాటక మద్యం పట్టివేత, ఇద్దరిపై కేసు నమోదు

గద్వాల క్రైం, ఏప్రిల్ 27 : జోగుళాంబ గద్వాల జిల్లాలోని అయిజ మండలం పులికల్ గ్రామం దగ్గర కర్ణాటక మద్యాన్ని పట్టుకున్నట్లు ఎక్సైజ్ సీఐ గణపతిరెడ్డి శనివారం తెలిపారు. ఇందుకు సంబంధించి ఆయన తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ అరుణ్‌కుమార్ ఆదేశాల మేరకు శనివారం పులికల్ గ్రామంలో వాహనాల తనిఖీ చేపట్టామన్నారు. కర్ణాటక రాష్ట్రం తలమర్రి గ్రామం నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని కనకవీడు గ్రామానికి కర్ణాటక మద్యాన్ని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసి వారి నుంచి 24 కాటన్ల మద్యం బాటిల్స్ రెండు ద్విచక్ర వాహనాలను సీజ్ చేసి రెండు కేసులు నమోదు చేసినట్లు సీఐ వివరించారు. తనిఖీల్లో ఎస్సై వీరేశలింగం, సిబ్బంది వేణు, శేఖర్‌నాయుడు, చందర్, మహేష్ పాల్గొన్నట్లు చెప్పారు.

చిన్నదర్పల్లిలో...

హన్వాడ : మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండలం చిన్నదర్పల్లి గ్రామంలో ఓ వ్యక్తి మద్యాన్ని అమ్ముతుండగా పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకటేష్ తెలిపారు. అతని వద్ద నుంచి ఏడున్నర లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. అదేవిధంగా గ్రామంలో గొడవలకు పాల్పడుతున్న ఓ వ్యక్తిని తహసీల్దార్ ముందు బైండోవర్ చేసినట్లు ఎస్సై తెలిపారు.

కూలి డబ్బులు అడిగిన వ్యక్తిపై దాడి

మహమ్మదాబాద్, ఏప్రిల్ 27 : చేసిన పనికి కూలి డబ్బులు అడిగిన వ్యక్తిపై దాడి చేసి గాయపరిచిన ఘటన మహబూబ్‌నగర్ జిల్లా మహమ్మదాబాద్ మండలం మంగంపేట గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన వడ్డె శ్రీను అదే గ్రామానికి చెందిన వడ్డె రాములు వెంట శుక్రవారం మహబూబ్‌నగర్‌లో కూలీ పనికి వెళ్లాడు. రాత్రి సమయంలో తనకు రావల్సిన కూలి డబ్బులు కోరగా వడ్డె రాములు, అతని భార్య సుజాత కలిసి వడ్డె శ్రీను తలపై బాదారు. తీవ్రంగా గాయపడిన శ్రీను పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో దాడి చేసిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

నీరందక రైతుల గోస

మహమ్మదాబాద్, ఏప్రిల్ 27 : భూగర్భజలాలు అడుగంటడంతో బోరు బావులు ఎండిపోయాయి. దీంతో వేసిన పంట నీరందక ఎండిపోతుండడంతో కాపాడుకునేందుకు ఓ రైతు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నాడు. మహబూబ్‌నగర్ జిల్లా మహమ్మదాబాద్ మండలం గాధిర్యాల్ గ్రామానికి చెందిన రైతు పులి అనంతయ్య తాను వేసిన వరి పంటను రక్షించుకోవాలన్న ఆలోచనతో పొలానికి ట్యాంకర్ల ద్వారా నీరందిస్తున్న దృశ్యం శనివారం 'ఆంధ్రజ్యోతి' కంట పడింది. మరో 15 రోజుల పాటు నీరందిస్తే పంట చేతికి వస్తుందని, అందుకే నీరు పోస్తున్నట్లు రైతు అనంతయ్య పేర్కొన్నాడు. తనకున్న నాలుగెకరాల్లో వరి నాటినట్లు తెలిపారు. అందులో సుమారు అర ఎకరానికి నీరు అందకపోవడంతో ఎండిపోతుందని గమనించి తనకు వేరేచోట పొలం వద్దనున్న బోరుబావి నుంచి నీటిని అక్కడే సంపులో నింపి ఊరు వద్దనున్న వరి పొలానికి ప్రతీరోజూ ఏడెనిమిది ట్యాంకర్ల ద్వారా నీరందిస్తున్నట్లు వివరించారు. గతంలో ఎప్పుడు కూడా ఇంత తీవ్రమైన నీటి ఎద్దడి ఎదుర్కోలేదని తెలిపారు.



వరి పొలానికి ట్యాంకర్ ద్వారా నీరు అందిస్తున్న దృశ్యం

అసంపూర్తిగా ఆస్పత్రి భవన నిర్మాణం

- ఎంఎంఎస్ భవనంలో అరకొర వసతులతో కొనసాగింపు



అసంపూర్తి పనులతో నిలిచిపోయిన ఆస్పత్రి భవనం

వెల్దండ, ఏప్రిల్ 27 : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పక్కా భవనంలేక అరకొర వసతుల నడుమ మండల మహిళాసమాఖ్య భవనంలో కొనసాగుతుంది. 2001లో గ్రామంలో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్యకేంద్రం భవనం నిర్మించిన కొద్దికాలానికే పనుల్లో నాణ్యత లోపించడంతో శిథిలావస్థకు చేరింది. ఎప్పుడు కూలుతుందోనన్న ఆందోళనతో ప్రత్యామ్నాయంగా 2021లో ప్రధాన రహదారికి అనుసరించుకుని ఉన్న ఎంఎంఎస్ భవనంలోనికి మార్చారు. కాగా శిథిలావస్థకు చేరిన భవనానికి మరమ్మత్తులు చేయించేందుకు 2021 - 22లో 43.50 లక్షలు మంజూరు చేశారు. అంతేగాక అదే ఏడాది జిల్లా ఆరోగ్యమిషన్ పథకం ద్వారా మరో 50 లక్షలు మంజూరుచేసి అదనంగా అదే ఆవరణలో మరో భవనం నిర్మాణం చేపట్టారు. కాగా పనులు అసంపూర్తిగా వదిలేశారు. ప్లాస్టరింగ్, సిమెంట్ రహదారి, తలుపులు, కిటికీలు, వైరింగ్, కలరింగ్, మరుగుదొడ్లు, తాగునీటి వసతులు ఏర్పాటు చేయాల్సిఉంది. భవన నిర్మాణం అర్ధాంతరంగా నిలిచిపోవడంతో నిరుపయోగంగా దర్శనమిస్తుంది. ఆస్పత్రి భవనం పూర్తికాకపోవడంతో ప్రస్తుతం ఉంటున్న ఎంఎంఎస్ భవనంలో పీహెచ్‌సీతోపాటుగా ఆయుర్వేద ఆస్పత్రిని నిర్వహిస్తున్నారు. చాలీచాలని గదులు, వసతులు లేక రోగులు, సిబ్బంది పడరానిపాట్లు పడుతున్నారు. కొన్ని సందర్భాలలో మెరుగైన వైద్యంకోసం ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లాల్సివస్తుంది. ఇప్పటికైనా అసంపూర్తిగా ఉన్న పీహెచ్‌సీ భవనాలను పూర్తిచేసి వినియోగంలోకి తేవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే



తాడూరులో పార్థివదేహానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి

తాడూరు, ఏప్రిల్ 27 : మండల కేంద్రంలో అనారోగ్యంతో యార వెంకట్రాములు శనివారం మృతి చెందారు. దీంతో విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి మృతుని ఇంటికెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కాంగ్రెస్ పార్టీలో చురుగ్గా తిరిగే యువ నాయకుడు యార కోటేశ్వర్ తండ్రి కావడంతో ఎమ్మెల్యే సైతం వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేస్తూ కుటుంబానికి తమ వంతు అండదండలను అందిస్తానని హామీ ఇచ్చారు. పరామర్శించిన వారిలో జడ్పీటీసీ సభ్యురాలు రోహిణి, ఎంపీటీసీ సభ్యురాలు రేణుక, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు మల్లయ్య, గోవర్ధన్‌రెడ్డి, ఆయా గ్రామాల ముఖ్య నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

శనీశ్వర స్వామికి భక్తిశ్రద్ధలతో అభిషేకాలు

బిజినేపల్లి, ఏప్రిల్ 27 : సార్ధసప్త శనీశ్వర స్వామి భక్తులు నల్లని వస్త్రాలు ధరించి నల్లని నువ్వులు, తిల తైలాలతో భక్తులు భక్తిశ్రద్ధలతో అభిషేకాలు చేశారు. బిజినేపల్లి మండలంలోని నంది వడ్డెమాన్‌లోని సార్ధ సప్త జేష్టదేవి సమేత శనీశ్వర స్వామికి శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయల ప్రధాన అర్చకుడు డాక్టర్ గవ్వమఠం విశ్వనాథశాస్త్రి మాట్లాడారు. వివిధ ప్రాంతాల ద్వారా వచ్చిన భక్తులు తెల్లవారు జాము నుంచి శనీశ్వర స్వామిని, బ్రహ్మ సూత్రం ఉన్న పరమశివుడికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ గోపాల్‌రావు, కమిటీ సభ్యులు వీరశేఖర్, ప్రభాకరాచారి, ఆలయ సహాయ అర్చకులు గవ్వమఠం శాంతి కుమార్, ఉమ్మయ్య, జయంత్, సిబ్బంది గోపాల్ రెడ్డి, రేవల్లి శ్రీకాంత్ రెడ్డి తదితరులు ఉన్నారు.

ఘనంగా సత్యనారాయణ స్వామి వ్రతాలు

బిజినేపల్లి, ఏప్రిల్ 27 : మండలంలోని పాలెంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం 16 మంది దంపతులు సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు భక్తులు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. క్రోధినామ సంవత్సరం చైత్రమాసం శనివారం సంకటహర చతుర్థి కావడంతో సత్యనారాయణ స్వామి వ్రతం చేస్తే భక్తుల కోరిన కోరికలు తీరుతాయని నమ్మకమని ప్రధాన అర్చకుడు కురవి రామానుజాచార్యులు తెలిపారు. సత్యనారాయణ స్వామి వ్రతకల్పం విని న భక్తులకు అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయంలో అన్నదానం చేపట్టారు.

ఘనంగా విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవం



యజ్ఞ పూజలు చేస్తున్న భక్తులు

వంగూరు ఏప్రిల్ 27; మండలంలోని పోల్కంపల్లిలో కనుకదుర్గ మాత, గణపతి, సుబ్రహ్మణ్య స్వామి గార్ల ధ్వజస్తంభ, శిఖర యంత్ర విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. శనివారం ఆలయం వద్ద హోమాలు, ప్రతిష్ఠ విగ్రహాల ఊరేగింపు తదితర కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద భక్తులకు అన్నదానం నిర్వహించారు.

'ప్రతీ కార్యకర్త సైనికుడిగా పని చేయాలి'

తిమ్మాజిపేట, ఏప్రిల్ 27 : నాగర్‌కర్నూల్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ మల్లు రవి గెలుపు కోసం ప్రతీ కార్యకర్త సైనికుల్లా పని చేయాలని జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి దానం బాలరాజు పిలుపునిచ్చారు. తిమ్మాజిపేట మండలంలోని పుల్లగిరి, ఇప్పలపల్లి గ్రామాలల్లో శనివారం యువజన కాంగ్రెస్ నాయకులతో సమావేశం నిర్వహించి ఐదుగురు చొప్పున ప్రచార కమిటీలను వేయడం అందుకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం పార్టీ కార్యాలయంలో ఎన్నిక కాబడిన సభ్యులతో సమావేశమై మాట్లాడారు. ఇంటింటికి తిరిగి గ్యారెంటీ కరపత్రాలను పంపిణీ చేసి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. నాయకులు వరుణ్‌కుమార్, సహదేవ్, ఆనంద్‌చారి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో పౌష్టికాహారంతో మెరుగైన విద్య

తెలకపల్లి, ఏప్రిల్ 27 : అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా మూడు సంవత్సరాల నుంచి ఆరేళ్ల చిన్నారులకు పౌష్టికాహారంతోపాటు ఎలాంటి ఒత్తిడి లేని ఆటపాటలతో మెరుగైన విద్య అందించబడుతుందని తెలకపల్లి మేజర్ గ్రామపంచాయతీ ఈవో కేవీ భాస్కర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని బీసీ కాలనీలోని అంగన్‌వాడీ సెంటర్‌లో ప్రీస్కూల్ వార్షికోత్సవాన్ని నిర్వహించి చిన్నారులకు ప్రోగ్రెస్ కార్డులను పంపిణీ చేశారు. అంగన్‌వాడీ ఉపాధ్యాయురాలు డి.చంద్రకళ, ఆశ కార్యకర్త పుష్పమ్మ, ఆయా బి.లక్ష్మమ్మ, చిన్నారుల తల్లిదండ్రులుపాల్గొన్నారు.

గురువుకు శిష్యుల ఆర్థిక సహాయం

కల్వకుర్తి, ఏప్రిల్ 27 : అనారోగ్యం బారిన పడిన ప్రైవేట్ పాఠశాల ఉపాధ్యాయుడు తిరుపతిరెడ్డికి శిష్యులు ఆర్థిక సహాయం అందించి ఆదర్శంగా నిలిచారు. కల్వకుర్తి పట్టణంలోని చైతన్య విద్యాలయంలో 1999 ఎస్ఎస్‌సీ బ్యాచ్ విద్యార్థులు తమకు పాఠశాలలో విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయుడు తిరుపతిరెడ్డి అనారోగ్యానికి గురైన విషయం తెలుసుకుని చలించిపోయారు. శనివారం తిరుపతిరెడ్డికి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.42వేల నగదు ఆర్థిక సహాయం అందజేశారు. భారతి, రియాజ్, గౌస్, వేణు, హరికృష్ణ, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే పేదల సంక్షేమం సాధ్యం

- ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి

కల్వకుర్తి, ఏప్రిల్ 27 : పేదల సంక్షేమాన్ని, అభివృద్ధిని ఆకాంక్షించే కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఆదరించి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ మల్లు రవిని భారీ మెజార్టీతో గెలిపించాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి కోరారు. రాష్ట్రంలో కొనసాగుతున్న ప్రజాపాలన మాదిరిగానే, దేశంలో కాంగ్రెస్ అధికారంలోకిరాగానే సుస్థిర ప్రజాపాలన అందుతుందని ఆయన పేర్కొన్నారు. కల్వకుర్తి పట్టణంలో ఓ ఫంక్షన్ హాల్‌లో కల్వకుర్తి, వెల్దండ మండలాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశం శనివారం నిర్వహించారు. సమావేశానికి కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి, నాగర్‌కర్నూల్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ మల్లు రవి, మాజీ మంత్రి చిత్తరంజన్‌దాస్, పార్లమెంట్ ఎన్నికల పరిశీలకురాలు ఇందిరా శోభన్, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే రాజ్యాంగ ఉనికికే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని ప్రజలంతా ఆలోచించి కాంగ్రెస్ పార్టీకి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగాన్ని మారిస్తే ఎస్సీ, ఎస్టీలు రిజర్వేషన్లకు దూరమవుతారని ఆవేదన వ్యక్తం చేశారు. కల్వకుర్తి నియోజకవర్గంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందేలా చూస్తానని ఎమ్మెల్యే కశిరెడ్డినారాయణరెడ్డి హామీ ఇచ్చారు. కేఎల్ఐ డీ-82 ప్రాజెక్టును పూర్తి చేయించి చివరి ఆయకట్టుకు సాగునీరందించేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కల్వకుర్తి నియోజకవర్గంలో నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా పని చేసి ఎంపీ అభ్యర్థి డాక్టర్ మల్లు రవికి భారీ మెజార్టీ వచ్చే విధంగా పని చేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. అనంతరం మల్లు రవి మాట్లాడుతూ పేదల కోసం నిరంతరం పని చేసే కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థిగా బరిలో ఉన్న తనను ప్రజలు అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండి సేవలందిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ ఠాకూర్ బాలాజీసింగ్, నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, విజయందర్, కల్వకుర్తి, వెల్దండ మండలాల కాంగ్రెస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో యువతకు 60శాతం అవకాశం కల్పిస్తాం

- ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్



సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్

అచ్చంపేటటౌన్, ఏప్రిల్ 27: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో యువతకు 60శాతం అవకాశం కల్పిస్తామని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ అన్నారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి సన్నాహక సమావేశంలో శనివారం పట్టణంలోని బీకే ప్యాలెస్‌లో నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణతో పాటు ఆయన పాల్గొని మాట్లాడారు. యువత రాజకీయాల్లో కీలకపాత్ర పోషిస్తూ పోరాటాలు చేస్తే రాబోవు రోజుల్లో మంచి భవిష్యతు ఉంటుదన్నారు. ఈ రోజు కష్టపడి పనిచేసినందుకు నాకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అవకాశం కల్పించారని, మీరందరూ కష్టపడి పని చేయాలని, నేను ఎమ్మెల్సీగా ఉన్నా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తగా పనిచేస్తానన్నారు. కాంగ్రెస్ పార్టీ విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఎన్ఎస్‌యూఐ ఎంతో కృషి చేసిందన్నారు. కాంగ్రెస్ రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటు అయిన తర్వాత యువతకు ఇప్పటికే 30వేల ఉద్యోగాలు అందజేశామన్నారు. మరో 30ఏళ్లు రాజకీయాల్లో మనమే ఉంటామన్నారు. బీజేపి బీఆర్ఎస్ డ్రామాలను విష ప్రచారాన్ని తిప్పి కొట్టాలన్నారు. నియోజకవర్గంలోని ప్రతీ వార్డులో, గ్రామాల్లో తిరిగి బీజేపీ చేసింది ఏమి లేదని, కాంగ్రెస్ చేయ బోయేది రైతులకు, ప్రజలకు వివరించాలన్నారు. నాగర్‌క ర్నూల్ ఎంపీ అభ్యర్థి మల్లు రవి గెలుపే లక్ష్యంగా మ నం పనిచేయాలన్నారు. నాయకులు కొయ్యల శ్రీనివాసులు, రామనాథం, గోపాల్ రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు 33శాతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత బీజేపీదే

- మహిళా శక్తిసమ్మేళనంలో బీజేపీ ఎంపీ అభ్యర్థి పోతుగంటి భరత్‌ప్రసాద్



మహిళా సమ్మేళనంలో అభివాదం చేస్తున్న బీజేపీ ఎంపీ అభ్యర్థి భరత్‌ప్రసాద్, రాష్ట్ర అధికార ప్రతినిధి కీర్తిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఎల్లేని

కొల్లాపూర్, ఏప్రిల్ 27 : దేశవ్యాప్తంగా మహిళలకు ప్రాధాన్యత కల్పిస్తూ చట్టసభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత బీజేపీదేనని నాగర్‌కర్నూల్ బీజేపీ ఎంపీ అభ్యర్థి పోతుగంటి భరత్‌ప్రసాద్ పేర్కొన్నారు. శనివారం కొల్లాపూర్ పట్టణంలోని లోటస్ మాన్సన్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన మహిళా శక్తి సమ్మేళనం కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నాగర్‌కర్నూల్ బీజేపీ ఎంపీ అభ్యర్థి పోతుగంటి భరత్‌ప్రసాద్, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి చందుపట్ల కీర్తిరెడ్డి, నాగర్‌కర్నూల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మహిళా శక్తి సమ్మేళనంలో బీజేపీ ఎంపీ అభ్యర్థి పోతుగంటి భరత్‌ప్రసాద్ మాట్లాడుతూ ఒక గిరిజన మహిళను దేశానికే ప్రథమ పౌరురాలుగా రాష్ట్రపతిగా నియమించిన ఘనత నరేంద్రమోదీదని, దేశంలో త్రిబుల్ తలాక్ బిల్లు ద్వారా ముస్లిం మహిళలకు రక్షణ కల్పించడంతోపాటు దేశవ్యాప్తంగా లక్షల కుటుంబాలకు మరుగుదొడ్లు నిర్మించడం ద్వారా మహిళల ఆత్మగౌరవంపై బీజేపీకి ఉన్న గౌరవం చాటుతుందని ఆయన పేర్కొన్నారు. బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి చందుపట్ల కీర్తిరెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావులు మాట్లాడుతూ బీజేపీతోనే మహిళా సాధికారిత ఏర్పడుతుందని, మహిళలు అన్ని రంగాల్లో ముందుకు రాణించేలా బీజేపీ ప్రోత్సహిస్తుందన్నారు. అనంతరం మహిళా సమ్మేళనంలో బీజేపీ ఎంపీ అభ్యర్థి పోతుగంటి భరత్‌ప్రసాద్‌ను మహిళా నేతలు శాలువా, పూల మాలతో ఘనంగా సన్మానించారు. బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాలతి, అసెంబ్లీ ప్రభారీ అయ్యప్పరెడ్డి, మహిళా మోర్చా అధికార ప్రతినిధి రోజారమణి, కోశాధికారి జ్యోతి, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు జానకి, శశిరేఖ, అపర్ణా రెడ్డి, పద్మ, రాధా, శ్రీలక్ష్మీ, పల్లవి, దళిత మోర్చా జిల్లా కార్యదర్శి కడ్తాల కృష్ణ, కాశిపురం మహేష్ పాల్గొన్నారు.

అసంపూర్తిగా రోడ్ల నిర్మాణం

- అవస్థలు పడుతున్న జనం
- నత్తనడకన రఘుపతిపేట రోడ్డు నిర్మాణం
- అసంపూర్తిగా తోటపల్లి రోడ్డు



అసంపూర్తిగా ఉన్న గుండూరు-రఘుపతిపేట రోడ్డు

కల్వకుర్తి, ఏప్రిల్ 27 : అసంపూర్తి రోడ్లతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. రోడ్డు ఎక్కి దిగాలంటే వాహన చోదకులు నరకం చూడాల్సి వస్తోంది. సంవత్సరంలో రోడ్డు పనులు పూర్తి చేయాల్సి ఉన్నప్పటికీ నత్తనడకను తలపిస్తుండడంతో గుండూరు-రఘుపతిపేట రోడ్డుపై ప్రయాణం నరకాన్ని తలపిస్తోంది. గుండూరు నుంచి తెలకపల్లి వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి 20లక్షలు మంజూరయ్యాయి. గుండూరు నుంచి రఘుపతిపేట వరకు కేవలం లింగసానిపల్లి సమీపంలో రెండు కల్వర్టుల నిర్మాణం పూర్తైంది. రోడ్డు పక్కన విస్తరణకు తవ్వి కంకరపోసి వదిలేయడంతో వాహనాలు నడపడానికి వాహన చోదకులకు ఇబ్బందులు తప్పడం లేదు. సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి నత్తనడకన నడుస్తున్న రోడ్డును పూర్తి చేయించి సమస్య పరిష్కరించాలని గుండూరు, లింగసానిపల్లి, రఘుపతిపేట, రామగిరి పరిసర గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఇదిలా ఉండగా కల్వకుర్తి మండలంలోని వేపూర్ నుంచి ఎల్లికట్ట రోడ్డు పూర్తిగా దెబ్బతిని రాకపోకలకు తీవ్ర అంతరాయంగా మారింది. వేపూర్ వరకు రోడ్డు నిర్మాణం జరిగిన వేపూర్ నుంచి ఎల్లికట్ట వరకు రోడ్డును నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ప్రాజెక్టు నిర్మిస్తే అడ్డుకొని తీరుతాం



ప్రాజెక్టు నిర్మాణం చేపట్టవద్దని తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న భూనిర్వాసితులు

బల్మూరు, ఏప్రిల్ 27 : మైలారం సమీపంలో ఉమామహేశ్వర ప్రాజెక్టు నిర్మాణం చేపడితే అడ్డుకుని తీరుతామని బల్మూరు, అనంతవరం గ్రామస్థులు స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు తహసీల్దార్ శైలేంద్రకుమార్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ పూర్వీకుల నుంచి వచ్చిన భూమిని సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని, ఈ ప్రాజెక్టు నిర్మాణం చేపడితే అనేక కుటుంబాలు చేదిరిపోయి పేదరికం అనుభవించే స్థాయికి పోతామన్నారు. వెంటనే ప్రభుత్వం, ఉన్నతాధికారులు ప్రాజెక్టును నిర్మించకుండా కాల్వల ద్వారా సాగునీరందిస్తే బాగుంటుందని వారన్నారు. ప్రాజెక్టు నిర్మాణం చేపడితే పెద్ద ఎత్తున పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు మల్లయ్య, శివశంకర్, మల్లేష్, చాంద్‌పాష, నరసింహ, వెంకటేశ్, నారాయణ, బక్కయ్య తదితరులు పాల్గొన్నారు.

● బల్మూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు

ఉమామహేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం చేపడితే అడ్డుకుంటామని ఆ విషయంలో రైతులపై ఎలాంటి కేసు నమోదు చేయవద్దని ఎస్ఐ బాలరాజుకు రైతులు రాతపూర్వకంగా వేడుకున్నారు. ప్రాజెక్టు నిర్మాణం చేపడితే మా భూములు పోతాయని మేము పోరాటం చేస్తామని అందుకు పోలీసులు ప్రజలు మా మీద ఎలాంటి కేసులు పెట్టవద్దని రైతులు కోరారు. అనంతవరం, బల్మూరు రైతులు శివశంకర్, మల్లయ్య, బక్కయ్య, చాంద్‌పాషా, నారాయణ, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణను ప్రపంచ పటంలో నిలిపిన బీఆర్ఎస్

- మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి



బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో తెలంగాణ తల్లికి నివాళులు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యేలు గువ్వల బాలరాజు, మర్రి జనార్దన్‌రెడ్డి

నాగర్‌కర్నూల్ టౌన్, ఏప్రిల్ 27: రాష్ట్ర సాధన అనంతరం తెలంగాణను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ప్రపంచ పటంలో నిలిపిన పార్టీ బీఆర్ఎస్ అని మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో ఆ పార్టీ ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గువ్వల బాలరాజు, మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్ హాజరై కార్యాలయం ఆవరణంలో పార్టీ జెండావిష్కరణ చేసి తెలంగాణ తల్లి విగ్రహానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ పార్లమెటు ఎన్నికల్లో అప్రమత్తంగా ఉండి కేసీఆర్ నాయకత్వాన్ని బలపరచాలని ఆయన పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఓటమికి గల కారణాలను తెలుసుకున్న మర్రి

తిమ్మాజిపేట: తన ఓటమికి గల కారణాలను మాజీ ఎమ్మెల్యే మర్రిజనార్దన్‌రెడ్డి తండావాసులను అడిగి తెలుసుకున్నారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అన్నారు. తిమ్మాజిపేట మండల పరిధిలోని బండమీదితాండా, బోరుగడ్డతాండాలల్లో ఇటీవల వివాహాలు జరిగిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాండునాయక్ చెల్లెలు, ఆదేవిధంగా మూడావత్ లోకేష్ సహోదరుడు శ్రీను రిసెప్షన్ వేడుకల్లో శనివారం పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. అంతకు ముందు బీఆర్ఎస్ పార్టీ నాయకులు రవి నాయక్ గృహ ప్రవేశంలోను పాల్గొని కాసేపుతండావాసులతో మాట్లాడారు. ఈ ప్రాంత అభివృద్ధికి ఎంతో కృషి చేశానని ఇంకెంతో చేయాలన్న తపన తనలో ఉందని, తప్పుగా ఆలోచన చేయడం ద్వారానే తనను ఓడించారని ఇకనైనా అందరూ ఒకటిగా ఉండి బీఆర్ఎస్‌కు ఓటు వేసి ప్రవీణ్‌కుమార్‌ను అధిక మెజార్టీతో గెలిపించేందుకు కృషి చేయాలన్నారు. బీఆర్ఎస్ మండల శాఖ అధ్యక్షుడు జోగు ప్రదీప్, ఎంపీపీ రవీంద్రనాథ్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు వేణుగోపాల్ గౌడ్, హర్యానాయక్, రవినాయక్, నాయకులు స్వామి, హుసేనీ, వెంకటేష్, కాలరాజు, జగన్ పాల్గొన్నారు.

కోరంలేక వాయిదాపడ్డ మండల సభ

వెల్దండ, ఏప్రిల్ 27 : ఎంపీపీ విజయ అధ్యక్షతన శనివారం నిర్వహించాల్సిన మండల సర్వసభ్య సమావేశం కోరంలేక వాయిదాపడింది. ఉదయం 11 గంటలకు జరగాల్సిన సభకు ఎంపీపీ విజయ, వైస్ ఎంపీపీ శాంతి, ఎంపీటీసీ సభ్యులు వెంకటరెడ్డి, లక్ష్మమ్మ మాత్రమే హాజరయ్యారు. మొత్తం 13 మంది సభ్యులకు గాను ఏడుగురు సభ్యులు హాజరైతేనే సభ జరుగుతుంది. కాగా కేవలం నలుగురు మాత్రమే హాజరుకావడంతో అదనంగా గంటపాటు ఎదురుచూసినా ఎవరూ రాకపోవడంతో కోరంలేకపోవడంతో సభను వాయిదా వేస్తున్నట్లు ఎంపీపీ ప్రకటించారు. వచ్చేనెలలో మరోమారు సభ నిర్వహణ తేదీని ప్రకటిస్తామని ఈ సందర్భంగా ఎంపీపీ విజయ తెలిపారు. సమావేశానికి ఎంపీడీవో సత్యపాల్‌రెడ్డి, తహసీల్దార్ రవికుమార్, ఏవో మంజుల, ఎంఈవో శంకర్‌నాయక్, ఏపీవో ఈశ్వర్ తదితరులు హాజరయ్యారు.

బీజేపీ ఇంటింటి ప్రచారం

వెల్దండ, ఏప్రిల్ 27 : కేంద్రంలోని బీజేపీ సర్కార్ అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలుచేస్తుందని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి యెన్నం శేఖర్‌రెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని అజిలాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని అంతిరెడ్డిపల్లిలో పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో పార్టీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మోదీ పథకాలను స్థానికులకు వివరిస్తూ కరపత్రాలు పంచారు. పార్లమెంటు ఎన్నికలో బీజేపీ అభ్యర్థిని గెలిపించాలని ఈ సందర్భంగా శేఖర్‌రెడ్డి కోరారు. నాయకులు మోహన్‌రెడ్డి, జంగయ్యయాదవ్ ఉన్నారు.

కొనసాగుతున్న ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవం



పూజా కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

కల్వకుర్తి, ఏప్రిల్ 27 : కల్వకుర్తి మండలంలోని యంగంపల్లి గ్రామంలో శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి దేవాలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవం కనుల పండువగా కొనసాగుతుంది. ఈ నెల 28వరకు ఉత్సవాలు నిర్వహించనున్నారు. శనివారం వేద పండితులు నూతన ఉత్సవ విగ్రహాలకు త్రేతాగ్ని యందు అగ్ని ప్రతిష్ఠాపన, అధివసములు, విశ్వక్సేన రాధన, పుణ్యాహవచనం, హోమాలు, శాంతి హోమాలు నిర్వహించారు. ప్రజలు, భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ఉత్సవాలను తిలకించారు. ప్రజలు, భక్త బృందం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మే డేను ఘనంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మారేడు శివశంకర్

కందనూలు, ఏప్రిల్ 27 : మే డే దినోత్సవాన్ని జిల్లావ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మారేడు శివశంకర్ పిలుపునిచ్చారు. నాగర్‌కర్నూల్‌లోని కామ్రేడ్ లక్ష్మణాచారి భవన్‌లో శనివారం ఏఐటీయూసీ జిల్లా కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మే డే స్ఫూర్తితో ఉద్యమాలను ఉధృతం చేయాలన్నారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు తప్పెట కిరణ్‌కుమార్, ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి చిన్నపాక శ్రీనివాసులు, వాడాల బాలపీరు, కర్నె భీమయ్య మేస్త్రీ, ఏఐటీయూసీ జిల్లా కౌన్సిల్ మెంబర్లు ఎం.యాదయ్య, ఆంజనేయులు, శ్రీశైలం, వెంకటస్వామి, రవీందర్, ఎ.చంటి, ఎ.ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

● చారకొండ: ప్రపంచ కార్మికుల దినోత్సవాన్ని విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా నాయకుడు డాక్టర్ చిలివేరు శ్రీనివాసులు అన్నారు. శనివారం చారకొండలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 1886లో అమెరికాలోని చికాగో నగరంలో 18 గంటల పనికి వ్యతిరేకంగా 8 గంటలు పని కావాలని కార్మికులు సమ్మె చేస్తే యజమాన్యం, పోలీసులు జరిపిన దాడిలో తమ రక్తాన్ని చిందించి పోరాడి కార్మికులు తమ హక్కులను సాధించుకున్నారని అన్నారు. దేశంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కార్మిక వర్గంపై అనేక భారాలు మోపుతూ కార్మిక వ్యతిరేక చట్టాన్ని తీసుకొచ్చిందని అన్నారు. విపరీతంగా ధరలు పెంచి పేదలపై భారం మోపిందని అన్నారు. మే డేలో ప్రతీ ఒక్కరు భాగస్వాములై విజయవంతం చేయాలని కోరారు. సీపీఐ నాయకులు ఏసారపు అశోక్‌గౌడ్, మద్ది నారాయణరెడ్డి, జెల్ల బాలయ్యగౌడ్, మొగిళ్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

● అచ్చంపేటటౌన్: మే డే ను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు అన్నారు. శనివారం పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. మే డే ఉత్సవాలను జయప్రదం చేయాలని కార్మికవర్గానికి పిలుపునిచ్చారు. వివిధ సంఘాల కార్మిక నాయకులు శంకర్, నాగరాజు, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

● పెంట్లవెల్లి: మే 1వ తేదీ నుంచి నిర్వహించే మే డే ఉత్సవాలను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఈశ్వర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో సీఐటీయూ అనుబంధ సంఘాలైన ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కార్మిక సంఘం నాయకులు తిమ్మస్వామి, చిట్టెమ్మ, ఈశ్వర్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

● కోడేరు : జిల్లాలోని వ్యవసాయ కార్మికులు, వివిధ రంగాల్లో పని చేసే కార్మికులు మేడే ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించి జయప్రదం చేద్దామని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.నరసింహ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని సీపీఎం పార్టీ కార్యాలయంలో మేడే సన్నాహక సమావేశం నిర్వహించారు. గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ అనుబంధ సంఘ నాయకులు సాయిబాబా, ఐకేపీ, వీవోఏ మండల నాయకులు నరసింహ, మధ్యాహ్న భోజన కార్మికురాలు లక్ష్మీ, అనసూయ, ఫీల్డ్ అసిస్టెంట్లు వెంకటయ్య పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

వెల్దండ, ఏప్రిల్ 27 : అనారోగ్యంతో మృతిచెందిన మండలకేంద్రానికి చెందిన గంగపోగు రామకృష్ణ కుటుంబాన్ని శనివారం కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎర్రశ్రీను స్థానిక నాయకులతో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి ఆయన 3వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణముదిరాజ్, నాగేశ్‌గౌడ్, నారాయణ తదితరులు ఉన్నారు.

సివిల్స్ ర్యాంకర్‌ను సన్మానించిన అధికారులు



యశ్వంత్‌ను అభినందిస్తున్న అధికారులు

వెల్దండ, ఏప్రిల్ 27 : ఇటీవల విడుదల చేసిన సివిల్స్ ఫలితాలలో 627 ర్యాంకు సాధించిన మండల పరిధిలోని పోచమ్మగడ్డతండాకు చెందిన యశ్వంత్ నాయక్‌ను శనివారం మండల అధికారులు సన్మానించారు. ఈ మేరకు ఎంపీడీవో సత్యపాల్‌రెడ్డి, ఎంపీవో సునీత, పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, కార్యదర్శులు గిరి, సురేందర్‌రెడ్డి, ఫయాజ్, శ్రీనివాస్‌లు యశ్వంత్‌కు శాలువాలు కప్పి అభినందించారు. సివిల్స్ ర్యాంకు రావడం మండలానికి గర్వకారణమని వారు పేర్కొన్నారు.

యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో కరపత్రాల ఆవిష్కరణ

కోడేరు, ఏప్రిల్ 27 : మండల కేంద్రంలో యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో రూపొందించిన కరపత్రాలను శనివారం యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కొడిదల రాము ఆవిష్కరించారు. కాంగ్రెస్ పార్టీ బలపర్చిన అభ్యర్థి డాక్టర్ మల్లు రవిని ఎంపీగా గెలిపించాలని అన్నారు. కోడేరు మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ వీరపాట కిరణ్‌కుమార్, నియోజకవర్గ అధ్యక్షుడు ఉదయ్‌కుమార్, కోడేరు మండల యూత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పుట్టరాము, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చామంతిరాజు, వెంకటిరెడ్డి, పెద్దకొత్తపల్లి మండల కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.